
సాక్షి ఒడిశా

శుక్రవారం ׀ 20 ׀ జూన్ ׀ 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,15,458లు, బంగారం 10 మిల్లీగ్రాములు, వెండి 7గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



నేడు తొలి వార్షికోత్సవం

జీజేపీ ప్రభుత్వ తొలి వార్షికోత్సవం నేడు జరగనుంది. ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- IIలో

ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు

భువనేశ్వర్: భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలకు శుక్రవారం రెండో పూట సెలవు ప్రకటించారు. ప్రధాని పర్యటనతో నగరంలో ట్రాఫిక్ రద్దీ పెరిగే దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం భువనేశ్వర్ మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ప్రాంతంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సగం రోజు సెలవు ప్రకటించింది. ఇంతకు ముందు జంట నగరాలు కటక్, భువనేశ్వర్ ప్రాంతాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే.

న్యూస్‌రీల్

జాలరి దశ మార్చిన చేపలు



జాలరి దశ మార్చిన తెలియా భోలా చేపలు

భువనేశ్వర్: ఒక జాలరి అకస్మాత్తుగా లక్షాధికారి అయ్యాడు. వేట కోసం విసిరిన వలలో ఔషధీయ విలువలతో నిండిన చేపలు చిక్కడంతో అతడి దశ తిరిగింది. దిఘా నదీ ముఖద్వారం పరిసరాలలో నానీ గోపాల్ ట్రాలరు నుంచి పన్నిన వలలో తెలియా భోలా చేపలు పడ్డాయి. ఒకే సారి 29 అరుదైన, అత్యంత విలువైన తెలియా భోలా చేపలు చిక్కడంతో అదృష్టం కలిసి వచ్చింది. ఒక్కో చేప 20 కిలోలు పైబడి బరువు తూగింది. నదీ ముఖద్వారం సమీపంలోని చేపల వేలం కేంద్రంలో రూ.33 లక్షలకు ఈ చేపలు అమ్ముడయ్యాయి. తెలియా భోలా చేపలను ఔషధీయ విలువల కారణంగా తీవ్రమైన వ్యాధులకు మందులు, సౌందర్య సాధనాల ఉత్పత్తిలో వాడతారు.

బాలలను పనిలో పెట్టుకోకూడదు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దాస్, డీఎల్‌ఓ భారతి తదితరులు

పర్లాకిమిడి: జిల్లాలో బాలలను పనిలో పెట్టుకోవడాన్ని నిషేధించాలని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బాల కార్మికుల నిర్మూలనపై జిల్లా కార్మిక ఉపాధి అధికారి భారతీ బెహరా అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమావేశం గురువారం జరిగింది. బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. దీనిపై జిల్లా టాస్క్‌ఫోర్సు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించారు. అలాగే ప్రజల్లో బాల కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి మనోరమా దేవి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా శిశు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, డీఈవో డా.మాయాధర్ సాహు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంతారావు తదితరులు

జయపురం: తమకు పురావాసం కల్పించాలని సో కెనాల్ రోడ్డులోని గ్యారేజ్ యజమానులు, వర్కర్లు జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం కుమారి శౌశ్యరెడ్డిని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ కలెక్టర్ నమ్రిత గౌడియకు వినతిపత్రం అందజేశారు. గ్యారేజ్‌లు తొలగించిన తర్వాత తమ జీవితాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు అర్థం చేసుకొని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణానికి రెండు లేదా మూడు కిలోమీటర్ల దూరంలో తమకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్యారేజ్ యజమానుల సంఘ అధ్యక్షుడు బి.కాంతారావు, కార్యదర్శి పితాంబర నాయిక్, కె.నారాయణరెడ్డి, చంద్రబాగ్, జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆవును రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



ఆవుని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: స్థానిక స్థానిక జైలు రోడ్డులోని ప్రాథమిక పాఠశాల పక్కనున్న మున్సిపాలిటీ కాలువలో బుధవారం సాయంత్రం ఒక ఆవు కాలుజారి పడిపోయింది. లోతైన, ఇరుకు కాలువ కావడంతో స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. వెంటనే అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం అతికష్టంగా స్థానికుల సహకారంతో దాదాపు రెండు గంటలు ప్రయత్నించి ఎట్టకేలకు ఆవును బయటకు తీసి రక్షించారు. దీంతో స్థానికులు సిబ్బందిని అభినందించారు.

పక్షిని ఢీకొన్న ఇండిగో విమానం

- అత్యవసర బ్రేకుతో తప్పిన ముప్పు



భువనేశ్వర్: ఇండిగో విమానం పక్షిని ఢీకొనడంతో పైలెట్ అత్యవసర బ్రేకులు వేయాల్సి వచ్చింది. స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నింగికి ఎగిరే ముందు పక్షి ఢీకొట్టింది. భువనేశ్వర్ నుంచి కోల్‌కతాకు బయల్దేరే ఇండిగో విమానం 6ఈ-6101 గురువారం ఈ ప్రమాదం నుంచి అదృష్టవశాత్తు బయట పడింది. పైలెట్ వెంటనే టేకాఫ్‌ను నిలిపి వేసి సురక్షితంగా ఉండటానికి అత్యవసర బ్రేక్‌లను వేశాడు. తక్షణమే విమానం పరిస్థితిని తనిఖీ చేశారు. ప్రయాణికులకు లేదా సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని సమాచారం. ఈ సంఘటన కారణంగా కొంతసేపు విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగింది.

భువనేశ్వర్ విమానాశ్రయం పరిసరాల్లో అడ్డంకులు: డైరెక్టర్

విమానం గాలిలో ఎగిరేందుకు, నేలపై వాలేందుకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పలు అడ్డంకులు ఉన్నాయని డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ తెలిపారు. ఈ మార్గంలో పెద్ద పెద్ద చెట్లు ఎదిగి ఉన్నాయి. రన్‌వేకి స్వల్ప దూరంలోనే అక్రమంగా నిర్మితమైన ఎత్తైన భవనాలు కూడ అడ్డంకిగా పరిణమించాయని ఆయన వివరించారు. గత నెలలో జరిగిన విమానాశ్రయ పర్యావరణ నిర్వహణ కమిటీ (ఏఈఎంసీ) సమావేశంలో స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ కమిషనర్‌కు ఈ విషయం గురించి తెలియజేశారు. విమానాశ్రయంలో ఎత్తుగా ఎదిగిన చెట్లను నరికివేసి, అడ్డంకిగా నిలిచిన ఎత్తైన భవనాలను కూల్చివేయాలని విమానాశ్రయం డైరెక్టర్ ప్రసన్న బీఎంసీ అధికార వర్గాలకు వివరించారు.

ఈ నెల 30న మాక్ డ్రిల్

ఈ నెల 30వ తేదీన స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మాక్ డ్రిల్ జరుగుతుంది. అహ్మదాబాద్ విమాన ప్రమాద దృష్ట్యా మాక్ డ్రిల్ నిర్వహిస్తారు. దీని కోసం పౌర విమానయాన డైరెక్టరు జనరల్ (డీజీసీఏ) సూచనలు జారీ చేసింది. విమానాశ్రయ సిబ్బంది, పోలీసులు, వైద్య, అగ్నిమాపక సిబ్బంది ఈ కసరత్తులో పాల్గొంటారు. ప్రమాదం వంటి ఏదైనా సంఘటన జరిగితే తక్షణమే దానిని ఎదుర్కొనే సన్నద్ధతపై అనుబంధ యంత్రాంగాన్ని చైతన్యపరచడం ఈ కసరత్తు లక్ష్యంగా పేర్కొన్నారు.

రవాణా రెట్టింపు అవుతుంది

స్థానిక బీపీఐఏ విమానాశ్రయంలో విమానాల రవాణా రెట్టింపు చేసే యోచనతో యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. నింగికి ఎగరడం, నేలకు వాలడం కోసం విమానాలకు మౌలిక సదుపాయాలతో అనుకూలమైన విధానం ప్రవేశ పెట్టనున్నట్లు విమానాశ్రయ డైరెక్టర్ ప్రసన్న ప్రధాన్ తెలిపారు. దీనితో విమానాశ్రయం కార్యాచరణ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో మౌలిక సదుపాయాల నవీకరణతో రన్‌వే సామర్థ్యం గంటకు రెండింతలకు పెరుగుతుంది. ప్రస్తుతం గంటకు 12 విమానాల రవాణా కొనసాగుతుంది. నవీకరణతో ఈ సామర్థ్యం గంటకు 24 విమానాల వరకు పెరుగుతుంది. గతంలో విమానాలు నేలకు వాలిన తర్వాత నింగికి ఎగిరేందుకు రన్ వే గుండా వెనక్కి మలుపు తిప్పడం అనివార్యం కావడంతో ఆలస్యం జరిగేది. నవీకరణ పురస్కరించుకుని విమానాశ్రయంలో ట్రాక్‌లు విమానాలు వేగాన్ని తగ్గించకుండా రన్ వే నుంచి త్వరగా నిష్క్రమించడానికి వీలు కల్పిస్తారు. రూ. 48 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు పనులు పూర్తి చేశారు. ఇటీవల పౌర విమానయాన డైరెక్టరు జనరల్ (డీజీసీఏ) నుంచి వాస్తవ కార్యాచరణకు అనుమతి లభించింది. ఈ మార్పులకు సంబంధించి విస్తృత సమాచారం కోసం భారత దేశ ఏరోనాటికల్ ఇన్ఫర్మేషన్ పబ్లికేషన్ (ఏఐపీ)లో ప్రతిబింబిస్తారు. తద్వారా అంతర్జాతీయ విమానాశ్రయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రయాణికులకు మరియు విమానయాన సంస్థలకు సమాచారం అందుతుంది. భద్రతా జాగ్రత్తల దృష్ట్యా విమానాశ్రయం పరిసరాల్లో ప్రతి మూడేళ్లకు ఒకసారి అడ్డంకి పరిమితి ఉపరితలాలు (ఓఎల్‌ఎస్) సర్వే నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో సురక్షితమైన కార్యాచరణ నిర్వహణ కోసం స్థానిక పౌర సంస్థలతో కలిసి విమానాశ్రయ వర్గాలు సమన్వయంతో పని చేస్తారు. అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత కేంద్ర ప్రభుత్వం తాజా నిర్ణయం ప్రకారం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న భవనాలు, చెట్ల ఎత్తును తగ్గించనున్నారు. భద్రతా చర్యలను దృష్టిలో ఉంచుకుని, పౌర విమానయాన నియమాలు 2025 ప్రకారం పౌర విమానయాన శాఖ సంబంధిత యజమానులకు తాఖీదు జారీ చేస్తుంది. పౌర విమానయాన అధికార వర్గాల తాఖీదు అందిన 60 రోజుల గడువు లోగా యజమాని ఇంటి ఎత్తును తగ్గించాల్సి ఉంటుంది. విమాన రవాణా మార్గానికి అడ్డుగా ఉన్న ఏదైనా చెట్టును వెంటనే నరికి వేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభావిత ఇంటి యజమాని పరిహారం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి యజమాని నిర్ణీత సమయంలోపు భవనాలను కూల్చి వేసి ఎత్తు తగ్గించని పరిస్థితుల్లో విమానాశ్రయ అధికారి జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తారు. తదనంతరం జిల్లా కలెక్టర్ జోక్యంతో ఇల్లు, చెట్ల ఎత్తు తగ్గిస్తారు.

హోటళ్లపై ఆకస్మిక దాడులు



హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు



పరిశుభ్రత లేని ఒక హోటల్ లోపలకు వెళ్లి పరిశీలిస్తున్న బెహురి

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సంతోష్ కుమార్ నాయక్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పంకొజిని బెహురీలు బుధవారం సాయంత్రం పలు హోటళ్లలో ఆకస్మిక దాడులను నిర్వహించారు. గుణుపూర్ కొత్తబస్టాండు వద్ద గల హోటళ్లలో దాడులను నిర్వహించిన అధికారులు అయా హోటళ్లలో పరిశుభ్రత లోపం, నిల్వ ఉన్న ఆహారాలను గుర్తించి జరిమానా విధించారు. వర్షాకాలం కావడంతో డయేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆహారంలో నాణ్యత లేకపోతే సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున దాడులు చేస్తున్నామన్నారు.

ప్రభుత్వ అధికారిక చిహ్నాల దుర్వినియోగం



వ్యక్తిగత వాహనానికి ప్రభుత్వ అధికారిక చిహ్నం

భువనేశ్వర్: రాష్ట్రంలో కలహండి ప్రాంతంలో శిక్షణ కొనసాగిస్తున్న ఒక ఐఏఎస్ అధికారి తన వ్యక్తిగత కారుపై ప్రత్యేక లైటు, ముందు భాగంలో ఐఏఎస్ ప్రొబేషనర్ రాతతో బోర్డు అమర్చడం వివాదాస్పదమైంది. ఇది మోటారు వాహనాల చట్టం ప్రకారం అనధికారిక చర్యగా పరిగణిస్తున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వ సాధారణ పాలన, ప్రజాభియోగాల విభాగం దృష్టికి రావడంతో విచారణకు ఆదేశించింది. విభాగం అదనపు కార్యదర్శి కలహండి కలెక్టర్‌ను ఈ వివాదంపై దర్యాప్తు చేయాలని ఆదేశించారు. ప్రొబేషనర్ ఏ అధికారం కింద ప్రైవేట్ వాహనంపై అలాంటి అధికారిక చిహ్నాన్ని ఉపయోగించారో తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు.

జీతం కోసం కలెక్టర్‌కు దరఖాస్తు



కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఆదివాసీ పూజార్లు

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లాలో వివిధ 14 తెగలకు చెందిన పూజార్లు నెలవారీ వేతనం కోసం గురువారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్‌కు వినతి పత్రం అందజేశారు. గిరిజనులకు మూలికలతో వైద్యం కూడా చేస్తున్నామని, అయినా ప్రభుత్వం తరపున ఎలాంటి సౌకర్యాలు దొరకడం లేదన్నారు.

వికాస వాహనానికి ఘన స్వాగతం



వివిధ పథకాల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

జయపురం: రాష్ట్రంలో మోహన్ చరణ్ మఝి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా అన్ని పంచాయతీల్లో తిరుగుతున్న వికాస వాహనం గురువారం కుంద్ర సమితి డొంగరపంశి పంచాయతీకి చేరింది. వాహనానికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అటవీ విభాగం ద్వారా ప్రజలతో మొక్కలు నాటించారు. అనంతరం కొత్త రేషన్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఘాశీ భొత్ర, గ్రామ పంచాయతీ అధికారి, అటవీ విభాగ అధికారి, సామాజిక సురక్షా అధికారి, లేబర్ విభాగ అధికారి పాల్గొన్నారు.

• జయహో జగన్నాథ



శ్రీ క్షేత్రంలో దేవుళ్ల యాత్రకు రథాల తయారీ పూర్తయ్యింది. పార్శ్వ భాగాల ఆకృతుల అమరికతో రథాలు యాత్రకు సిద్ధం అవుతున్నాయి. రథాల శిఖరాగ్ర భాగం వరకు తయారీ పనులు విజయవంతం కావడంతో వడ్రంగి, భొయి వర్గం సేవకులు జై జగన్నాథ్ నినాదంతో స్వామికి కృతజ్ఞతపూర్వకంగా స్మరించుకున్నారు.

- భువనేశ్వర్/పూరీ

కొండను ఆక్రమించుకుంటే సహించేది లేదు



బిసంకటక్ పోలీసుస్టేషన్ వద్ద బక్సీసిరిపూర్ గ్రామస్తులు



కొండపై ఆక్రమణలను అడ్డుకుంటున్న గ్రామస్తులు

రాయగడ: విలువైన వృక్ష సంపద, ఔషధ మొక్కలను నాశనం చేసి కొండను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని బిసంకటక్ సమితి బక్సీసిరిపూర్ గ్రామస్తులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం బిసంకటక్ పోలీసుస్టేషన్, అటవీ శాఖ, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని వినతిపత్రాలను సమర్పించారు. బక్సీసిరిపూర్ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్వలాభాల కోసం గ్రామ సమీపంలోని చెట్లను నరికివేస్తున్నారని పేర్కొన్నారు. కొండపై ఉన్న వృక్ష సంపదను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. పచ్చని చెట్లు, విలువైన ఔషధ గుణాలు కలిగిన మొక్కలు కొండపై ఉన్నాయని, అదేవిధంగా అటవీ ఉత్పత్తులను సేకరించి జీవనోపాధిని పొందే ఎంతోమంది ఈ కొండపై ఆధారపడుతున్నారని తెలియజేశారు. స్వప్రయోజనాల కోసం కొండను నాశనం చేసి ఆక్రమించుకునే ప్రయత్నం చేయడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని కొండను కాపాడాలని కోరారు.

నయాఘడ్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం



పర్లాకిమిడి హైస్కూల్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే అరుణ్ సాహుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ట్రాన్స్‌జెండర్స్

పర్లాకిమిడి: స్థానిక హైస్కూల్ జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం నయాఘడ్ ఎమ్మెల్యే అరుణ్ సాహు దిష్టిబొమ్మను ట్రాన్స్‌జెండర్లు దహనం చేశారు. జూన్ 17న నయాగడ్ శాసనసభ్యులు అరుణ్ సాహు పూరీలో బహిరంగంగా బీజేపీ ఎమ్మెల్యేలను ఉద్దేశించి (మైచియా అని) అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ట్రాన్స్‌జెండర్స్‌కు క్షమాపణలు చెప్పాలని జిల్లా కిన్నెరుల సంఘం అధ్యక్షుడు జాస్మిన్ షేక్ డిమాండ్ చేశారు. కిన్నెరులు రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే 30 జిల్లాలల్ల సంఘంగా ఏర్పడి స్వతహాగా తమ కాళ్లపై నిలదొక్కుకుంటున్న సమయంలో శాసనసభ్యులు అరుణ్ సాహు ట్రాన్స్‌జెండర్స్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై మండి పడ్డారు. నయాఘడ్ ఎమ్మెల్యే అరుణ్ సాహు క్షమాపణలు చెప్పకుంటే రాస్తారోకో ఆందోళన చేపడతామని, దీనికి మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయిక్ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుదని జాస్మిన్ షేక్ అన్నారు. ఈ ఆందోళనలో మధుబోరాడో, స్వీటీ తదితరులు పాల్గొన్నారు.



హైస్కూల్ జంక్షన్ వద్ద ఎమ్మెల్యే అరుణ్ సాహుకు వ్యతిరేకంగా టైర్లు కాల్చుతున్న ట్రాన్స్‌జెండర్స్ సంఘం ప్రతినిధులు

• వింత చర్యలు



భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో రాజధాని నగరంలో ప్రధాన మార్గాల్లో దిట్టమైన రహదారుల పక్కన గోతులు తవ్వి బలహీనపరిచారు. ప్రధాన మంత్రి భద్రతా చర్యల్లో భాగంగా రహదారి పక్కన పటిష్టమైన లోహపు బారికేడ్లు ఉండగా రోడ్లు తవ్వి అదనంగా వెదురు బొంగులతో కంచె సిద్ధం చేయడం హాస్యాస్పద చర్యగా విమర్శలు ఎదుర్కొంటుంది.

- భువనేశ్వర్


జీ 7 ప్రముఖులకు బహుమతులుగా రాష్ట్ర కళాఖండాలు



వెండి తీగల అల్లిక పర్సు



కోణార్కు కాల చక్రం



పొట్టా చిత్రం

భువనేశ్వర్: కెనడాలో జరిగిన జీ-7 సమ్మిట్‌లో పాల్గొనేందుకు హాజరైన ప్రముఖులకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అద్భుతమైన రాష్ట్ర కళాకృతుల్ని బహుమానంగా అందజేశారు.

జీ-7 సదస్సులో పాల్గొన్న కెనడా గవర్నర్ జనరల్ మేరీ సైమన్‌కు ప్రధాన మంత్రి వెండి తీగల అల్లిక క్లచ్ పర్స్‌ను బహుమతిగా ఇచ్చారు. రాష్ట్రంలో కటక్ అందమైన వెండి తీగల సంప్రదాయ అల్లిక చేతి పనులకు (తారొకొసి) ప్రసిద్ధి. ఈ అపురూప కళ 500 సంవత్సరాలు పైబడిన ప్రాచీనమైనది. ఆనాటి మొఘల్ చక్రవర్తుల ఆదరణతో వెలుగొందిన కళ నేటికి నిలకడగా తళుక్కుమంటోంది.

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్‌కు ప్రపంచ ప్రఖ్యాత 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయం కాల చక్రం కానుకగా సమర్పించారు. ఇసుక రాయితో రూపుదిద్దుకోన్న కోణార్కు చక్రం ప్రతిరూపం రాష్ట్ర శిల్ప కళా నైపుణ్యాన్ని జీ 7 దేశాల్లో ప్రధాన మంత్రి ప్రతిబింబింపజేశారు. సూర్య రశ్మి ఆధారంగా సమయం సూచించే రీతిలో ఈ చక్రంలో ఊచల్ని శిల్పులు చెక్కు చెదరకుండా పొందుపరచడం విశేషం. ఇది అంతులేని కాల చక్రాన్ని చూపుతుంది.

పూరీ జిల్లా కళా గ్రామం రఘురాజపూర్ ప్రాంతపు పొట్టా చిత్రాన్ని క్రొయేషియా అధ్యక్షుడు జోరాన్ మిలనోవిచ్‌కు ప్రధాన మంత్రి బహుమతిగా సమర్పించారు. పొట్టా చిత్రం రాష్ట్రానికి చెందిన అందమైన సంప్రదాయ కళారూపం. ఇది వస్త్రంపై వివరణాత్మక, రంగురంగుల చిత్రాలకు ప్రసిద్ధి చెందింది. దీంతో ఈ చిత్రాలు పొట్టా (వస్త్రం), చిత్ర (చిత్రం)గా పేరొందాయి. సాధారణంగా భారతీయ పౌరాణిక గాథల శీర్షికల ఇతివృత్తంగా అర చేతిలో ఇమిడే అతి చిన్న చిత్రాలు మొదలు కొని సువిశాల పటాలు రూపొందించడం రఘురాజపూర్ కళాకారుల ప్రత్యేకతని జీ 7 ప్రతినిధులకు ప్రధాన మంత్రి ప్రతిబింబింపజేయించడం విశేషం.

క్లుప్తంగా

శ్రీ జగన్నాథునికి మస్నృణ లేపన సేవ

భువనేశ్వర్: రాజ వైద్యుల ఆధ్వర్యంలో తెర చాటున గోప్యంగా చికిత్స పొందుతున్న శ్రీ జగన్నాథుడు క్రమంగా కోలుకుంటున్న సంకేతాలు వస్తున్నాయి. అనవసర నవమి తిథి పురస్కరించుకుని గురువారం మూల విరాటులకు మస్నృణ లేపన సేవతో వైద్యం కొనసాగించారు. సుభాషిత నువ్వుల నూనెలో గుగ్గిలం జోడించి మిశ్రమంగా తయారు చేసి మూల విరాట్లకు లేపనం చేయడాన్ని మస్నృణ లేపన సేవగా వ్యవహరిస్తారు. ఇంతకు ముందు అనవసర పంచమి నాడు మూల విరాటుల అంగాలకు ఫులురి తైల మర్దన చేసిన విషయం తెలిసిందే.

నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నూతన జాతీయ విద్య విధానంపై అభివృద్ధి మేళాలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చిత్తరంజన్ పాణిగ్రాహి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు నైపుణ్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని డిగ్రీ, డిప్లమా పూర్తి చేయాలన్నారు. ప్రత్యేకంగా ఒడియా భాష, కళలు, సంస్కృతిపై దృష్టి పెట్టాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. 250 పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సీడీఎంఓ, రక్తదాతలు

పర్లాకిమిడి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ కేంద్ర ఆస్పత్రిలో గురువారం రక్తదాన శిబిరాన్ని గజపతి జిల్లా బ్లడ్ డోనర్స్ సంఘం ప్రతినిధులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ముఖ్య వైద్యాధికారి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మహ్మద్ ముబారక్ ఆలీ, సీనియర్ ఫార్మాసిస్టు ఖగేశ్వర బెహరా తదితరులు హాజరయ్యారు. 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో గజపతి బ్లడ్ డోనర్స్ సంఘం అధ్యక్షుడు గవర నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్.రుషి, కె.శరత్‌కుమార్, క్రాంతి బెహరా, సుస్మిత, మోహినీ ప్రధాన్‌పాల్గొన్నారు.

యోగా దినోత్సవం విజయవంతం చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న జరిగే యోగాలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్' అనే థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అదే విధంగా, అలాగే రానున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గురుకులాల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గురుకుల సమన్వయకర్త గ్రేస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 19 నుంచి జిల్లాలోని 8 పాఠశాలల్లోనూ దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా బాలురకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్ల గురుకులంలో ఈ నెల 25న ఉదయం 10 నుంచి పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరో తరగతిలో 279 సీట్లు, ఏడో తరగతిలో 155 సీట్లు, ఎనిమిదో తరగతిలో 92 సీట్లు, 9వ తరగతిలో 96 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పూర్తి వివరాలకు 9701736862 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూటికుప్పల సురేష్‌కుమార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో సంఘ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నాగళ్ల మురళీధర్, జిల్లా కార్యదర్శిగా కవిటి దేవరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శిగా కిల్లి కుమారస్వామిని నియమించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

నేడు బీజేపీ ప్రభుత్వం తొలి వార్షికోత్సవం

- ప్రధాన మంత్రి రాక ప్రత్యేక ఆకర్షణ


ప్రధాన మంత్రి బహిరంగ సభా ప్రాంగణం ఏర్పాట్లు పర్యవేక్షణలో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నేతృత్వంలో రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తొలి సారిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి పురస్కరించుకుని శుక్రవారం తొలి వార్షికోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విచ్చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రధానంగా పార్టీ కార్యకర్తలు ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రత్యక్షంగా ప్రధాన మంత్రి ప్రసంగించనున్న జనతా మైదానం సందర్శించి ఏర్పాట్లని గురువారం ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆయనతో ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా వంటి ప్రభుత్వ ఉన్నతాధికారులతో పలువురు పార్టీ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రధాన మంత్రి పర్యటన కార్యక్రమాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం మధ్యాహ్నం 3.40 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ)చేరుతారు.
- ప్రధానమంత్రికి సంప్రదాయ రీతుల్లో స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. అనంతరం మధ్యాహ్నం 3.45 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు, ప్రధాన మంత్రి విమానాశ్రయం నుంచి సభా ప్రాంగణం జనతా మైదాన్ వరకు భారీ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మార్గంలో రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించే అనేక ఒడియా జానపద సంగీతం, నృత్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహక వర్గాలు తెలిపాయి.
- ఊరేగింపుతో సభా ప్రాంగణంకు చేరడంతో జనతా మైదానంలో సాయంత్రం 4.15 గంటల నుంచి 5.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా రూ. 17,000 కోట్ల విలువైన కొత్త అభివృద్ధి మరియు సంక్షేమ ప్రాజెక్టుల ప్రారంభిస్తారు. రాష్ట్ర వృద్ధికి దీర్ఘకాలిక భావి ప్రణాళిక కార్యాచరణ వివరించే ఒడిశా విజన్ డాక్యుమెంట్‌ను ప్రధాన మంత్రి ఆవిష్కరిస్తారు.
- ఈ సభకు లక్ష మందికి పైగా ప్రజలు హాజరవుతారని అంచనా. తిరిగి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్థానిక విమానాశ్రయం నుంచి సాయంత్రం 5.50 గంటలకు న్యూ ఢిల్లీకి బయలుదేరుతారు.

భారీ భద్రత బందోబస్తు

ప్రధాన మంత్రి పర్యటన పురస్కరించుకుని భారీ భద్రతా బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ), కమిషనరేట్ పోలీస్, అగ్ని మాపక దళం, రాష్ట్ర నిఘా, ఉగ్రవాద వ్యతిరేక యూనిట్‌లతో బహుళ వర్గాలతో భద్రతా వలయం ఏర్పాటు చేశారు. విమానాశ్రయం నుంచి బహిరంగ సభా ప్రాంగణం వరకు జరిగే భారీ ఊరేగింపు బాధ్యతల్ని భువనేశ్వర్ పోలీస్ కమిషనర్ సురేష్ దేవ్ దత్తా సింగ్ ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. ఈ నేపథ్యంలో నగరాన్ని విమానాశ్రయం నుండి సభా ప్రాంగణం వరకు నో–డ్రోన్, నో–ఫ్లై జోన్‌గా ప్రకటించారు. వేడుకలను సజావుగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 60 మంది ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) అధికారులను నియమించింది.

రథయాత్రకు ప్రజలు సహకరించాలి


రథయాత్ర కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ బిజయ కుమార్ దాస్

పర్లాకిమిడి: ఈ నెల 27న పర్లాకిమిడి రాజవీధిలో జరుగనున్న జగన్నాథస్వామి రథయాత్రకు సంబంధించి రెండోసారి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధ్యక్షతన జిల్లా స్వయం ఉపాధి గ్రామీణ సమావేశ మందిరంలో గురువారం ఉదయం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రథయాత్ర కమిటీ చైర్మన్ సబ్ కలెక్టర్ అనుప్ పండా, జిల్లా ఎస్పీ జ్యోతింద్రనాథ్‌పండా, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, తదితరులు హాజరయ్యారు. సమావేశంలో రథయాత్ర కమిటీతో కలెక్టర్ పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. రథయాత్రలో చోరీలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు. ఆంధ్ర, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చే ఆటోలకు పాత ఫైర్ స్టేషన్ వద్ద పార్కింగ్ సదుపాయం, రాజవీధిలో గుండిచా బడి వెళుతున్న మార్గమధ్యంలో చిల్లర, బొమ్మల దుకాణాలు ఎత్తివేయించాలని పురపాలక ఈఓను కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది రథయాత్రకు అధిక సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి అన్నప్రసాదాలు, తాగునీరు, ట్రాఫిక్ సమస్యలపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. మరో నాలుగు రోజుల్లో మూడు జగన్నాథ రథాలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని రథ యాత్ర కమిటీ సభ్యులు కలెక్టర్‌కు నివేదించారు.

రబీ ధాన్యం కొనుగోలుకు సమయం పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

జయపురం: కొరాపుట్ జిల్లా రైతుల నుంచి రబీ ధాన్యం కొనుగోలు చేయాలని జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ కృషక మోర్చా, కొట్‌పాడ్ రబీ మండీ కమిటీలు ప్రతినిధులు సంయుక్తంగా విజ్ఞప్తి చేశారు. గురువారం కొట్‌పాడ్ కృషక మోర్చా అధ్యక్షుడు సీతానాథ్ బిశ్వాల్, కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో పలువురు రైతులు జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. అందులో జూన్ 2 నుంచి మండీలలో రబీ ధాన్యం కొనుగులు చేస్తామని ప్రకటించిన అధికారులు.. రైతులకు టోకెన్లు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. కొట్‌పాడ్‌లో 10వ తేదీన మండీలు ప్రారంభించారని, గత 8 దినాలలో రైతుల నుంచి ధాన్యం కొనలేదని ఆరోపించారు. ధాన్యం కొనేందుకు కలహండి, బలంగీర్ మిల్లర్లతో అగ్రిమెంట్ జరిగిందని, కానీ ఏ మిల్లరు రైతుల నుంచి పూర్తిగా ధాన్యం కొనలేదని ఆరోపించారు. కొట్‌పాడ్‌లో 605 మంది రైతులు సహకార సమితిలో సభ్యులుగా చేరారన్నారు. వారిలో 181 మంది రైతుల నుంచి ధాన్యం కొన్నారని వెల్లడించారు. 605 మంది రైతుల వద్ద 62,514 క్వింటాళ్ల ధాన్యం ఉన్నాయని, 15,868 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొన్నారన్నారు. మిగతా ధాన్యం మండీలు, ఇళ్ల వద్ద ఉన్నాయని వెల్లడించారు. ఈ నెల 2 నుంచి 18వ తేదీ వరకు అంటే 17 దినాలలో 15,868 క్వింటాళ్ల దాన్యం కొన్నారని, ఇంకా 13 దినాలు మాత్రం మిగిలి ఉన్నాయన్నారు. ఈ పరిస్థితిలో రోజుకు రెండు ట్రక్కుల రావటం కష్టంగా ఉందని, కొన్ని దినాలలో అసలు ట్రక్కులే రావటం లేదని వెల్లడించారు. ట్రక్కులు మిల్లర్ల చేతులలో ఉన్నాయన్నారు. మండీ బాధ్యతలు నిర్వహిస్తున్న సహకార సమితి, మార్కెటింగ్ ఇన్‌స్పెక్టర్ కలుగజేసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితిని అధికారులకు తెలిపినా పట్టించుకోవటంలేదని ఆరోపించారు. అధికారుల నిర్ణయం ప్రకారం ఈ నెల 30వ తేదీలోగా ఎన్ని ధాన్యం కొంటారని ప్రశ్నించారు. అందు వల్ల మరో 15 రోజులు సమయం పెంచాలని రైతులు కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సంజయ కుమార్ నాయక్, సుమన్ నాయక్,సీతారాం సామంత రాయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటిని తీసుకుంటే బతికేదెలా?


అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు కాపీలు చూపిస్తున్న శిమ్మ చిన్నమ్మి

సారవకోట: కుమార్తెలు ఆదరించడం లేదంటూ సారవకోట మండలం అలుదు గ్రామానికి చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు శిమ్మ చిన్నమ్మి వాపోయింది. తనకు ముగ్గురు కుమార్తెలున్నా ఎవరూ ఆదరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త నుంచి సంక్రమించిన ఇంటిని సైతం చిన్న కుమార్తె ఆధీనంలో తీసుకుని ఇంటి నుంచి పంపించేందుకు చూస్తోందని ఆరోపించింది. దీనిపై తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లలో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. చిన్న కుమార్తె తన ఇంటిని తనఖా పెట్టి రూ.3 లక్షలు అప్పు తీసుకుని చెల్లించనందున, అప్పు ఇచ్చిన వారు ఆ ఇంటిని తీసుకోడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపింది. ఆ ఇంటిని తీసుకుంటే తనకు నిలువు నీడ కూడా ఉండదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని వేడుకుంటోంది.

కలప అక్రమ రవాణా అడ్డగింత


స్వాధీనం చేసుకున్న దుంగల వద్ద విజిలెన్స్ అధికారులు

ఎచ్చెర్ల : మండలంలోని కేశవరావుపేట, కింతల మిల్లు జంక్షన్ వద్ద విజిలెన్స్, అటవీశాఖ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా లారీ, బొలెరో వాహనాల్లో తరలిస్తున్న కలపను గుర్తించారు. రూ.39,405 విలువైన తొమ్మిది క్యూబిక్ మీటర్లు కలిగిన అకేషియా కలప దుంగలను పట్టుకున్నారు. వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు సతీష్‌కుమార్, రవిప్రసాద్, సీఐలు రామారావు, అశోక్, ఎస్ఐలు పీసీలు ఈశ్వరరావు, కన్నబాబు, లక్ష్మీనారాయణ, శేషగిరి, సాయిరాం పాల్గొన్నారు.

ముగిసిన అభివృద్ధి మేళా


ఒడిస్సీ నృత్య బృందం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రం డీఎన్‌కే క్రీడా మైదానంలో గత వారం రోజులుగా నిర్వహించిన అభివృద్ధి మేళా గురువారంతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా అభివృద్ధి మేళాను నిర్వహించారు. చివరి రోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బోండా, కోయి, శాంతాలి, గదబ, ఒడిస్సీ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నృత్య బృందాలకు జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర సోభరో సర్టిఫికెట్లు అందజేశారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ దారులుకు అభినందనలు తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అభినందించారు.


శాంతాలి బృందానికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న జిల్లా అభివృద్ధిశాఖ అధికారి నరేశ్ చంద్ర సోభరో


ఆదివాసీ నృత్యం చేస్తున్న యువకులు


నృత్యం చేస్తున్న బోండా మహిళలు


ఆదివాసీ నృత్యం చేస్తున్న బృందం

పాత జిల్లా ఆస్పత్రిలో సామగ్రి చోరీ


చోరీకి గురైన కిటికీ ఫ్రేములు

టెక్కలి రూరల్ : టెక్కలి పాత జిల్లా ఆస్పత్రిలో విలువైన ఇనుప సామగ్రి చోరీకి గురవుతోంది. ఇప్పటికే సిల్వర్ పైపులు, ఫైబర్ ఫ్రేమ్‌లు మాయం కాగా, తాజాగా కిటికి గోడలు సైతం ధ్వంసం చేసి వాటికి ఉన్న ఐరన్ ఫ్రేమ్‌లు పట్టుకుపోయారు. విలువైన సామగ్రి మొత్తం చోరీకి గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పాత ఆస్పత్రి బిల్డింగ్‌లు పూర్తిగా శిథిలావస్థకు రాకముందే వాటిని వాడుకలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.


గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

గిరిశిఖర గ్రామానికి వెళ్లి..

కష్టాలు తెలుసుకుని..

- ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన కొండపైకి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- గిరిశిఖర గ్రామం చందనగిరిలో పర్యటన
- గిరిజన మహిళలతో మాటామంతీ


రేషన్ బియ్యంతో వస్తున్న వృద్ధురాలితో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: సుమారు 1300 అడుగుల ఎత్తులో, ఉత్తరాంధ్రలోనే ఎత్తయిన గిరిశిఖర గ్రామం గొట్టిపల్లి పంచాయతీ చందనగిరి గ్రామంలో పాతపట్నం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రివిలేజ్ కమిటీ సభ్యురాలు రెడ్డి శాంతి పర్యటించారు. గిరిజనులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు ఏడు కోట్ల రూపాయల నిధులతో గిరిజన గ్రామాలకు రహదారులు వేశామని గుర్తు చేశారు. చందనగిరి గ్రామానికి రహదారి, తాగునీటి సదుపాయం కల్పించడమే కాకుండా.. ఎన్నడూ లేనివిధంగా ప్రత్యేక నిధులతో ట్రాక్టర్ ద్వారా కొండపైకే రేషన్ సరుకులు అందించామని చెప్పారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గిరిజన వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని మండిపడ్డారు. కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. చందనగిరి గ్రామం నుంచి రేషన్ సరుకులు తీసుకోవడానికి కాలినడకన కొండదిగి నేలబొంతు గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, మహిళలు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అమలుకాని హామీలు ఇచ్చి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. నేడు గిరిజన గ్రామాలకు వెళ్తే ఎక్కడచూసినా జగనన్న ఇచ్చిన తాగునీరు, రహదారులు, భవనాలు కనిపిస్తున్నాయి.. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఏం చేసిందని ప్రశ్నించారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని, సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని భరోసా ఇచ్చారు. అంతకుముందు గ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో గౌరమ్మ అనే వృద్ధురాలు బియ్యం మూట పట్టుకుని కొండ ఎక్కుతున్న సమయంలో రెడ్డిశాంతి ఆమెను ఆటో ఎక్కించి పంపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సవర ఆదినాయుడు, సర్పంచ్ జొలిబేరు జమ్మయ్య, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పోలాకి జయమునిరావు, కో ఆప్షన్ సభ్యుడు భాస్కరదాస్, నాయకులు బైపోతు ఉదయ్‌కుమార్, కరణం శశిభూషణరావు, అలికాన మాధవరావు, సవర సుభాస్, గొల్ల జనార్దన, జన్ని నాగేశ్వరరావు, పెద్దబొంతు అప్పారావు, ఢిల్లీ, సలాన చిట్టి తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కల ధరలా..

మేమేం చేయలేం!

- చర్చల్లో చేతులెత్తేసిన పలాస ఎమ్మెల్యే శిరీష
- నిరాశతో బయటకు వచ్చేసిన జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు
- అధికార పార్టీ తీరుపై మండిపాటు


ఎమ్మెల్యే శిరీషతో మాట్లాడుతున్న జీడి రైతాంగ కమిటీ ప్రతినిధులు

పలాస: పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల్లో ఉద్దానం ప్రజల జీవనాధారమైన జీడి రైతులు కూటమి సర్కారు తీరుతో ఉసూరుమన్నారు. జీడిపిక్కల కొనుగోలు, ధరల విషయమై జీడి రైతాంగ పోరాట కమిటీ నాయకులు గురువారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్దానం జీడి రైతుల సమస్యలు, గిట్టుబాటు ధరల విషయంపై జీడి రైతాంగ కమిటీ కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, రైతు నాయకులు అంబటి రామకృష్ణ, కోనేరు రమేష్, మద్దు రాఘవరావు, అర్లి దానేసు తదితరులు ఎమ్మెల్యేకు వివరించారు. గత ఎన్నికల సమయంలో బస్తా జీడి పిక్కలను రూ.16వేలుకు కొనుగోలు చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సరికి బస్తా పిక్కలు ధర రూ.13,500 ఉందని చెప్పారు. అదే ధరకు రైతులంతా తప్పని పరిస్థితిలో జీడి పిక్కలను పలాస వ్యాపారులకు అమ్ముకున్నారని తెలిపారు. ఈ ఏడాది మే నెలలో కూడా రూ.13,500 మాత్రమే ఉందని, పెరుగుతుందని ఆశించినా రైతులకు నిరాశ తప్పలేదన్నారు. జూన్‌లో పెరగడం పోయి ధరలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ ప్రతినిధులు ఎంత నెత్తుకొట్టుకున్నా ఈ ధరలు తమ చేతుల్లో లేవని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఒక్క మాట చెప్పి చేతులెత్తేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో రైతాంగ ప్రతినిధులు నిరాశతో తిరిగి వచ్చేశారు.

ఎమ్మెల్యే తీరుపై విమర్శలు..

జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయాల్సిన సమయంలో పరిశ్రమలను ఎందుకు బంద్ చేశారని అటు జీడి కార్మికులతో పాటు జీడి రైతులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, మార్కెట్‌లో జీడి పప్పు ధర ఏమాత్రం తగ్గడం లేదు. పలాస కాష్యూలేబర్ యూనియన్, పలాస కాష్యూ అసోసియేషన్ రెండు సంఘాలు కూడా తెలుగుదేశం పార్టీ నాయకుల చేతుల్లో ఉన్నాయి. గత 20 రోజులుగా జీడి కార్మికులకు ఉపాధిలేదు. ఉద్దానం ప్రాంతంలో జీడి పిక్కలు కొనడానికి జీడి వ్యాపారులు ముందుకు రావడం లేదు. వారు కొనుగోలు చేయలేకపోవడానికి వారి వద్ద తగిన డబ్బులు లేవని ఆ వ్యాపారస్తులు చెబుతుండటం విడ్డూరంగా ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో ఇటు జీడి కార్మికులకు , అటు జీడి రైతులకు తగిన న్యాయం చేయాల్సిన ఎమ్మెల్యే శిరీష తన చేతుల్లో ఏమీ లేదని చెప్పడంపై రైతులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజక వర్గ ప్రజలకు అండగా ఉంటూ చట్టసభలు, వివిధ రూపాల్లో పోరాటాలు చేయాల్సింది పోయి ఈ విధంగా తాము ఏమీ చేయలేమని చెప్పడం సరి కాదని చెబుతున్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి

• పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న షర్మిల

విజయనగరం ఫోర్ట్: కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై దృష్టి సారించినట్టు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. దీనికోసం గ్రామ స్థాయిలో ఉన్న ఇబ్బందులను తెలుసుకునేందుకు జిల్లా పర్యటనకు వచ్చినట్టు తెలిపారు. విజయనగరం మెసానిక్ టెంపుల్‌లో గురువారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. పార్టీ బలోపేతంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల సమస్యలపై పోరాటం చేసినది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనన్నారు. కూటమి ప్రభుత్వం రాజధానిపై పోరాటం చేస్తే హౌస్ అరెస్టు చేశారని, స్టీల్ ప్లాంట్ కోసం దీక్ష చేస్తే దీక్ష భగ్నం చేశారని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేసినది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, డాక్టర్ గేదెల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లపై 6ఎ కేసు నమోదు



పట్టుకున్న సిలిండర్లతో విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

డెంకాడ: మండలంలోని రెండు హోటళ్లపై విజిలెన్స్ అధికారులు దాడులు చేసి 6ఎ కేసు నమోదు చేశారు. ఈ మేరకు చింతలవలస పరిధి ఉన్న 99 ద రాయల్ బిర్యానీ హౌస్, జొన్నాడ వద్ద ఉన్న ద్వారకా హోటల్‌లో విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. ఇంటిలో వినియోగించాల్సిన ఎల్‌పీజీ సిలిండర్లను హోటల్‌లో వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దీంతో 99 ద బిర్యాని హౌస్‌లో 6 సిలిండర్‌లు, ద్వారకా హోటల్‌లో 5 సిలిండర్లను పట్టుకుని 6ఎ కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. పట్టుకున్న సిలిండర్లను సాయి గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, వీఆర్‌వోలు కన్నయ్య, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ దినోత్సవం

పార్వతీపురంటౌన్: రెవెన్యూ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన జారీ చేశారు. జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ డే సందర్భంగా ప్రతి రెవెన్యూ కార్యాలయంలో వేడుకలు జరుగుతాయన్నారు. ఈ వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగుల బాధ్యతలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు.

'తోటపల్లి'పై కూటమి కినుక

- సాగునీటి కాలువలను బాగు చేయలేదు
- దీనిపై రైతుల పక్షాన పోరాటం చేస్తాం
- నేటి సాయంత్రం కాలువల పరిశీలన కార్యక్రమం
- ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రాంత్, కళావతి

పాలకొండ: తోటపల్లి కాలువలను ఆధునీకరించి రైతులకు సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ధ్వజమెత్తారు. పాలకొండలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగునీ టి కాలువల అభివృద్ధిపై ప్రభుత్వం కినుక వహించడాన్ని తప్పుబట్టారు. శిథిలావస్థకు చేరిన నాగావళి కుడి, ఎడమ కాలువల షట్టర్లు బాగుచేయాలని డిమాండ్ చేశారు. షట్టర్లు పాడవ్వడంతో రిజర్వాయర్‌లోని నీరు సాగునీటి కాలువల్లోకి పెద్ద స్థాయిలో చేరి గండ్లు పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే నీరు వృథాగా సరఫరా అవుతూ పంటపొలాల్లో చేరి వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతోందన్నారు. 2023-24 సంవత్సరంలో గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వం కొత్త షట్టర్ల ఏర్పాటుకు రూ.20 లక్షలు మంజూరు చేసిందని, టెండర్ల దశలో ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు. ఎడమ కాలువ ప్రధాన లింక్ కెనాల్ రక్షణ గోడకు సాంకేతి అనుమతులు తీసుకువచ్చామన్నారు. అనంతరం ప్రభుత్వం మారడంతో ఈ పనులు బుట్టదాఖలయ్యాయన్నారు. కాలువల ఆధునికీకరణ పనులను పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కాలువల షట్టర్లు బాగుచేయాలని, కాలువ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

జోగిందొరవలసకు ఝలక్..!

- తొలుత మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తింపు, తర్వాత రద్దు
- మౌలికవసతులు లేని కారణంగా జాబితా నుంచి తొలగింపు
- నష్టపోతున్న గిరిజన విద్యార్థులు



జోగిందొరవలసలోని ప్రాథమిక పాఠశాల



రామభద్రపురంలోని పూడి వీధి ప్రాథమిక పాఠశాల

ఈ చిత్రంలో కనిపిస్తున్నది రామభద్రపురం మండలకేంద్రలోని పూడివీధి ప్రాథమిక పాఠశాల. ఇక్కడ 54 పిల్లలు చదువుతుండగా ఇద్దరు టీచర్లు మాత్రమే విద్యాబోధన చేస్తున్నారు.ఈ పాఠశాల మోడ్ ప్రైమరీ పాఠశాలకు ఉండాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయి.ఈ పాఠశాలను కూడా మొదట్లో మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించారు,ఆ తర్వాత పంచాయతీలో ఇప్పటికే మూడు మోడల్ ప్రైమరీ పాఠశాలలను గుర్తించాం. నాలుగోది వద్దు అని రద్దు చేశారు. ప్రభుత్వం నిర్ణయాలతో పిల్లలు నష్టపోతున్నారని తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు.

రామభద్రపురం: పేదల చదువు విషయంలో విద్యార్థులతో ప్రభుత్వం ఆటలాడుతోంది. విద్యకు పెద్ద పీట వేస్తున్నాం. విద్యారంగంలో పలు ఉన్నత సంస్కరణలు తీసుకొచ్చి పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యనందిస్తామని చెప్పి పలు పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించి ఆ పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి తరగతికొక ఉపాధ్యాయుడిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలోని పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల అని చెప్పి 239 పాఠశాలలను గుర్తించింది. వాటిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా తరగతికి ఒక టీచరు చొప్పున ఏర్పాటు చేసింది. అయితే ఇదంతా బాగానే ఉంది. రామభద్రపురం మండలంలోని గొల్లలపేట పంచాయతీ పరిధి జోగిందొరవలస గిరిజన గ్రామ ప్రాథమిక పాఠశాలలో 44 మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడి విద్యార్థుల సంఖ్య సరిపడా ఉన్నారని మొదటి జాబితాలోనే మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించి విద్యాశాఖ అధికారులు ఆ జాబితాను ఎంఈవోలకు పంపించారు.అలాగే పాఠశాలలో మౌలికవసతులు ఎలా ఉన్నాయని, పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఎంఈవోలకు ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఎంఈవో పరిశీలించి పిల్లలు సరిపడా ఉన్నా మౌలికవసతులు లేవని నివేదిక పంపించారు. దీంతో విద్యాశాఖ ఉన్నతాధికారులు మోడల్ ప్రైమరీ పాఠశాల గుర్తింపు రద్దు చేశారు. దీంతో ఆ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు నాణ్యతతో కూడిన మెరుగైన విద్యకు దూరమవుతున్నామని గగ్గోలు పెడుతున్నారు.

మౌలికవసతుల బాధ్యత ప్రభుత్వానికి లేదా?

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పాఠశాలలు ఆధునికీకరణ పనులు చేపట్టి కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను తయారు చేసింది. ఈ క్రమంలో నాడు-నేడు పథకం రెండోదశలో జోగిందొరవలస గిరిజన గ్రామంలోని పాఠశాల ఎంపిక చేసి రెండు ఫ్లోర్‌లలో అదనపు గదులతో పాటు మౌలికవసతుల కల్పనకు రూ.35 లక్షలు మంజూరు చేసింది. అప్పట్లో రూ.19 లక్షలతో కిందన ఒక తరగతి గదితో బాత్‌రూంలు, కిచెన్ షెడ్డు నిర్మించారు, ఇంతలో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తిగా నిధులు విడుదల చేయకుండా నిలిపివేసింది. దీంతో పాఠశాలలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తరగతి గదిలో గోడలకు సున్నం వేయకపోవడంతో పాటు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గచ్చు నేలపై కూర్చుని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. తమ పంచాయతీలోని జోగిందొరవలస పాఠశాలలో మాత్రమే సరిపడా పిల్లలు ఉన్నారని, మౌలికవసతులు లేవన్న సాకుతో మోడల్ ప్రైమరీ పాఠశాలను తొలగిస్తారా? మౌలివసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ హామీ నీటిమూటేనా?

జోగిందొరవలస ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుని అన్ని మౌలివసతులు కల్పిస్తానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హామీ ఇస్తూ ఆ పాఠశాల హెచ్‌ఎంతో ఫోన్‌లో చెప్పారని తెలిసింది. ఎంపీ హామీతో మా గ్రామ పాఠశాల బాగుపడుతుంది అని అక్కడి ప్రజలు ఆనందపడ్డారు. అయితే ఆ హామీ ఇచ్చి సుమారు 6 నెలలు కావస్తున్నా ఇప్పటికీ ఆ ఊసేలేదు. దాంతో గ్రామస్తుల ఆనందం ఆవిరై..ఎంపీ హామీ నీటిమూటేనా అని మండిపడుతున్నారు.

మరోసారి పరిశీలించాలని ఆదేశిస్తా..



45 మంది రోల్ ఉన్న పాఠశాలలను మాత్రమే మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా గుర్తించాం.జోగిందొర పాఠశాలను మరోసారి పరిశీలించాలని ఎంఈవోను ఆదేశిస్తాను. ఎంఈవో నివేదిక తీసుకుని పరిశీలించి ప్రభుత్వానికి పంపిస్తాను. అవసరమైతే పిల్లలు నష్టపోకుండా మరో టీచర్‌ను నియమిస్తాం.

యు.మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

రాజన్నదొరపై తప్పుడు మాటలు మాట్లాడితే ఖబడ్దార్

- మక్కువ టీడీపీ మండలాధ్యక్షుడిపై నిప్పులు చెరిగిన వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు

సాలూరు: మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు, మంత్రి సంధ్యారాణి సన్నిహిత అనుచరుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు నోరు అదుపులో పెట్టుకోవాలని, స్థాయిని మరిచి విమర్శలు చేస్తే సహించేది లేదంటూ గిరిజన ప్రజాప్రతినిధులు, నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం సాలూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీలు ప్రమీల, రాములమ్మ, సర్పంచ్‌లు ఆదయ్య, సుదర్శనరావు, ఎంపీటీసీ సుబ్బారావు, సీతారాం, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నాయకులు పరిమళ, ఉదయ్‌కుమార్, కల్యాణ్ తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏఎంసీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మంత్రి సంధ్యారాణి సమక్షంలో టీడీపీ మండలాధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరను ఉద్దేశించి దగాకోరు అంటూ చేసిన తీవ్ర అభ్యంతరకర పదజాలాన్ని వాడారంటూ అందరూ ముక్త కంఠంతో మండిపడ్డారు. ఓ గిరిజన రైతు కుటుంబం నుంచి నిబద్ధతగల రాజకీయనాయకుడిగా ఉపముఖ్యమంత్రి, మంత్రి స్థాయికి ఎదిగి ఎందరో గిరిజనులకు ఆదర్శంగా రాజన్నదొర నిలిచారన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సాలూరుకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులు విరివిగా చేయించి, సంక్షేమం, అభివృద్ధి అంటే ఏమిటో తన పాలనలో చూపించారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఏనాడూ ఎవరిపై వ్యక్తిగత విమర్శలు చేయకుండా పార్టీల విధి విధానాలపై రాజకీయ విమర్శలు మాత్రమే చేశారని గుర్తుచేశారు. అటువంటి రాజన్నదొరపై గుల్ల వేణు దగాకోరంటూ మాట్లాడడం దానిని అక్కడే ఉన్న మంత్రి సంధ్యారాణి వారించకపోవడాన్ని గిరిజనసమాజం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

ఆధారాలు చూపించాలి

రాజన్నదొరను దగాకోరు అని వేణుగోపాల్ ఏ ఆధారాలతో మాట్లాడాడో ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని స్పష్టం చేశారు. ఆధారాలు చూపించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రి సంధ్యారాణి సమక్షంలో విలేకరిని చంపుతానని హెచ్చరించిన వేణు, మంత్రి అండదండలతో రెచ్చిపోతున్నాడని విమర్శించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రెడ్డి సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు భరత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

- డీఎంహెచ్ఓ ఎస్.జీవనరాణి



సికిల్‌సెల్ వ్యాధిపై పోస్టర్లు, పుస్తకాలు విడుదల చేస్తున్న దృశ్యం

మెంటాడ: గిరిజన ప్రాంత ప్రజలు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలని విజయనగరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. ప్రపంచ సికిల్ సెల్ నివారణ దినం సందర్భంగా మెంటాడ మండల పరిషత్ అధికారులు, విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో లోతుగెడ్డ పంచాయతీ ఉయ్యాడవలసలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సికిల్ సెల్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించి పోస్టర్లు, పుస్తకాలు ప్రారంభించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ అధికారి డాక్టర్ కె.రాణి మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి పట్ల అవగాహనతో ఉండాలని అందరూ పరీక్షలు చేసుకోవాలని కోరారు, ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన పిదప ఇచ్చే చికిత్సలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, మెంటాడ పీహెచ్‌సీ వైద్యురాలు జె. లోకప్రియ, స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంతృప్తి కరమైన జీవనశైలికి యోగా దోహదం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



యోగాసనం వేస్తున్న మంత్రి శ్రీనివాస్ తదితరులు

గంట్యాడ:

భారతీయుల వారసత్వ సాంస్కృతిక సంపదైన యోగాను యావత్ ప్రపంచం అనుసరిస్తోందని తద్వారా సమగ్రమైన, ప్రశాంతమైన సంతృప్తికరమైన జీవనశైలి వైపు పయనించే అవకాశం ఉందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని గొర్రిపాటి బుచ్చి అప్పారావు జలాశయం వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ యోగాను విశ్వవ్యాప్తం చేసిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. యోగా ప్రతిరోజూ చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. విద్యార్థులు వారి జీవనంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ మాణిక్యం నాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, పర్యాటక అధికారి కుమారస్వామి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఎం.ఆనందరావు, మెప్మా పీడీ చిట్టిరాజు, ఎంపీడీఓ రమణమూర్తి, సీడీపీఓ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

యోగా డే



అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పీడీ సూర్యనారాయణ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు 'యోగా డే' ఆకృతిలో కూర్చొని యోగా ప్రాధాన్యంను తెలియజేశారు.

\- సంతకవిటి

రైతన్నపై విత్తు భారం.. రూ. 99.01 లక్షలు!



- ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం రూ.91 వేల హెక్టార్లు
- దీనికోసం కేటాయించిన విత్తనాలు 50,010 క్వింటాళ్లు
- బస్తాకు 30 నుంచి రూ.126 పెరుగుదల

వరి విత్తనాల ధరలు:

విత్తన రకం	గతేడాది	ఈ ఏడాది	పెరిగిన ధర
సాంబమసూరి (25 కేజీలు)	రూ.795	రూ.825	రూ.30
ఎంటీయూ-1224(25కేజీలు)	రూ.795	రూ.800	రూ.05
ఆర్‌జీఎల్-2537(30 కేజీలు)	రూ.954	రూ.990	రూ.36
బీపీటీ-3291	రూ.834	రూ.960	రూ.126
ఎంటీయూ-1121	రూ.894	రూ.960	రూ.66
ఎంటీయూ-1318	రూ.894	రూ.960	రూ.66
ఎన్ఎల్ఆర్-3449	రూ.915	రూ.960	రూ.45

వరి విత్తన కేటాయింపు ఇలా...

విత్తన రకం	కేటాయించిన విత్తనాలు క్వింటాళ్లలో
ఎంటీయూ-1121	38,000
ఎంటీయూ-1224	16,50
బీపీటీ-3291	2,500
బీపీటీ-5204	2,500
ఎంటీయూ-7029	2,000
ఎంటీయూ-1318	800
ఎంటీయూ-1064	2,200
ఆర్‌జీఎల్-2537	200
ఎంటీయూ-1061	60
ఆర్ఎన్ఆర్-15048	50
ఎన్ఎల్ఆర్-3449	50

విజయనగరం ఫోర్ట్:

'ఎద్దు పుండు మీద కారం చల్లిన' చందంగా తయారైంది రైతులపై కూటమి ప్రభుత్వం తీరు. పంటలకు గిట్టుబాటు ధర లేక.. పంటను కొనుగోలు చేసేవారు లేక రైతులు కాడి విడిచి పెట్టాల్సిన పరిస్థితి నెలకుంది. వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా ఓ వ్యాపకంగా చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రైతన్నలను అన్ని విధలా ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఎన్నికల వేళ ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇప్పటివరకు అమలుచేయలేదు. కౌలు రైతులకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఖరీఫ్ సాగుపెట్టుబడికి డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ స్థితిలో రైతులకు రాయితీపై అందించే వరి విత్తన ధరలు పెరగడంపై ఆందోళన చెందుతున్నారు. ఆ భారాన్ని ఎలా భరించాలంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు.



వరి విత్తన బస్తాలు

• ఇదీ లెక్క..

జిల్లాలో వరి పంట సాగు సాధారణ విస్తీర్ణం 91 వేల హెక్టార్లు. ఈ మేరకు వ్యవసాయ అధికారులు 50,010 క్వింటాళ్ల విత్తనాలు జిల్లాకు కేటాయించారు. ఇప్పటి వరకు 35,335 క్వింటాళ్ల విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో నిల్వ చేశారు. వరి విత్తనాల ధరలు గతేడాది కంటే ఈ ఏడాది బస్తాకు రూ.30 నుంచి రూ.126ల వరకు పెరిగాయి. దీనివల్ల జిల్లా రైతులపై రూ.99.01 లక్షల భారం పడనుంది. రైతు సంక్షేమానికి పాటు పడతామని గొప్పలు చెప్పిన కూటమి సర్కారు విత్తన ధరలు పెరిగినప్పటికీ వాటిని తగ్గించే ఆలోచన చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఏడాది ధర పెరిగింది

నాకు రెండు ఎకరాలు పొలం ఉంది. గతేడాది ఎంటీయూ-1121 రకం వరి పంట వేశాను. విత్తన బస్తా రూ.894లకు కొనుగోలు చేశాను. ఈ ఏడాది అవే విత్తనాలను రూ.960కు కొనుగోలు చేశాను. గతేడాది కంటే ఈ ఏడాది రూ.66లకు ఎక్కువ చెల్లించాను.

\- రంధి నాగేశ్వరావు, రైతు, పెదవేమలి

యోగాంధ్రకు సమాయత్తం కావాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి సమాయత్తం కావాలని మండల ప్రత్యేక అధికారులు, జిల్లా, మండల అధికారులను కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో యోగాంధ్ర, స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర, డీఏ జుగా తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశాఖపట్నంలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొననున్నారని, అదే సమయంలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 3,150 వేదికల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 5.42 లక్షల మంది యోగాంధ్రకు రిజిస్టర్ చేసుకున్నారని, వీరంతా ఆ రోజు పాల్గొనేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీవేదిక వద్ద బ్యాక్ డ్రాప్ బ్యానర్, సౌండ్ సిస్టం, ప్రత్యక్ష ప్రసారం, గ్రీన్ మ్యాట్ ఇతరత్రా ఏర్పాట్లు ఉండాలని, ఆ రోజు ఉదయం 6 గంటలకే అందరూ సిద్ధంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. యోగా చేసే సమయంలో క్వాలిటీతో కూడిన ఫొటోలు, వీడియోలు తీయించాలని, ప్రజా స్పందన కూడా తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. 21న జరగనున్న యోగాంధ్రలో ప్రజలతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.ఎస్.భాస్కరరావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, డాక్టర్ టి.జగన్మోహనరావు, డ్వామా పథక సంచాలకులు కె.రామచంద్రరావు, డీపీఓ టి.కొండలరావు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ఐటీడీఏ ఏపీడీ ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.కృష్ణవేణి, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి ఇ.అప్పన్న, జిల్లా మత్స్య శాఖాధికారి టి.సంతోష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన యానాది రవి

డెంకాడ: విజయనగరం-నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారిపై డెంకాడ మండలం పెదతాడివాడ కూడలి సమీపంలో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో చిత్తూరు జిల్లాకు చెందిన యానాది రవి(36) మృతి చెందాడు. ఎస్సై ఎ. సన్యాసినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యానాది రవి, బావ కంతలచెరువు గోపి ఈ నెల 13వ తేదీన చిత్తూరు జిల్లా నుంచి ఐషర్‌వ్యాన్‌లో టమాటో లోడ్‌తో విజయనగరం వచ్చారు. 15వ తేదీ ఉదయం 10 గంటల ప్రాంతంలో అన్‌లోడ్ చేశారు. అక్కడి నుంచి ఐషర్ వాహనం యజమానికి ఫోన్‌చేయగా పెదతాడివాడ వద్ద ఉన్న న్యూ వెంకట్ మినీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి చిత్తూరు ఏమైనా కిరాయి ఉంటే చేసుకుని రావాలని చెప్పారు. దీనిలో భాగంగా యానాది రవి, బావ కంతలచెరువు గోపి పెదతాడివాడ వచ్చి ఉన్నారు. 18వ తేదీ రాత్రిభోజనం అనంతరం 11:30 గంటల సమయంలో ఫోన్ పట్టుకుని రవి బయటకు వెళ్లగా, గోపి వాహనంలో సేదదీరుతున్నాడు. ఇంతలో పెద్ద శబ్దం వచ్చింది. చీకటిలో వెళ్లి వెతకగా రవి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా వారు వచ్చి రక్తపు మడుగులో ఉన్న యానాది రవిని పరీక్షించారు. అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారని మృతుడి బావ కంతలచెరువు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు. ఐషర్ వాహనంలో గోపి డ్రైవర్‌గా, రవి క్లీనర్‌గా పని చేస్తున్నారు. మృతుడు యానాది రవి చిత్తూరు జిల్లా బైరెడ్డిపాలెం మండలం నెల్లిపట్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.